క్లుప్తంగా

పేదలకు వస్త్రదానం



వస్త్రాలను అందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్

శ్రీకాకుళం కల్చరల్ : నిత్యాన్నదానంతో పాటు వస్త్రాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని శాంతాకల్యాణ అనురాగ నిలయం, సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయం, దుర్గాదేవి చారిటబుల్ ట్రస్ట్, వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయం ఆధ్వర్యంలో శనివారం ఏడురోడ్ల కూడలి వద్ద మగటపల్లి రమణమూర్తి 95వ జయంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో నేత్రవైద్యులు కె.జగన్మోహనావు, ఎంసీ సభ్యులు చిన్మయరావు పి.సంతోషి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



సరుకులు అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్ : స్థానిక మండలవీధికి చెందిన డిగ్రీ విద్యార్థిని లీలారాణి కుటుంబానికి పెద్దపాడుకు చెందిన బొట్టాసాయి కుమార్, దామోదర్‌లు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం, నగదు శనివారం అందించారు. లీలారాణి తల్లి చనిపోగా, తండ్రి అనారోగ్యంతో మంచం పట్టారు. దీంతో లీలారాణి డిగ్రీ మొదటి ఏడాది చదువుతూ నెలవారీ బియ్యంతోనే జీవనం కొనసాగిస్తున్నారు. వీరి దీనస్థితిని తెలుసుకున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉర్లాం శివతేజ, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ ద్వారా ఈ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో నరేంద్ర, మోహన్, గోవింద్, అచ్యుత్, సురేష్, నరేష్, రవి, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్లతో జీవన ప్రమాణాల వృద్ధి



సామగ్రిని పరిశీలిస్తున్న మెప్మా పీడీ ఎస్.వి.రమణ

శ్రీకాకుళం: పట్టణ సంఘ మహిళల్లో మెరుగైన జీవన ప్రమాణాలు వృద్ధికి అర్బన్ మార్కెట్లను ప్రోత్సహిస్తున్నట్లు మెప్మా పీడీ ఎస్.వి.రమణ అన్నారు. శనివారం నగరంలోని రైతుబజార్ ఎదుట ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాసాంతంలో జరుగుతున్న మార్కెట్లను ప్రతీ రోజూ నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సంఘ మహిళల్లో విలక్షణమైన, విభిన్నమైన జీవనోపాధులకు అర్బన్ మార్కెట్లు వేదిక కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ సంపద, స్త్రీనిధి, పట్టణ మహిళా సమాఖ్యల అధ్యక్షులు బి.నాగలక్ష్మి, వి.వెంకటలక్ష్మీ, మెప్మా సీఎంఎం ఎస్.వెంకటరావు, ఆర్పీలు పాల్గొన్నారు.

బేస్‌బాల్ విజేతలకు అభినందనలు



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బేస్‌బాల్ క్రీడాకారిణులు జీవిత, లక్ష్మి జిల్లా జట్టు తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ నెల 24 నుంచి 28 వరకు తిరుపతిలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా జట్టు రెండో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను హెచ్ఎం శ్రీనివాసరావు, పీడీ రవికుమార్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



బాషా దంపతులను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగికి ఎప్పటికైనా పదవీ విరమణ సహజమని, అంకితభావంతో పనిచేస్తే తప్పక గుర్తింపు లభిస్తుందని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ అన్నారు. ఆర్టీసీ ఓపీఆర్ఎస్(ఆన్‌లైన్ పాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్) సూపర్‌వైజర్ ఎండీఏ బాషా శనివారం ఉద్యోగ విరమణ చెందడంతో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, అధికారులు ప్రసాద్, ఎంపీ రావు, ఎల్ఎస్ నాయుడు, శ్రీనివాస్, కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళకు.. లాల్ సలామ్!



- ఆర్ట్, డిజైనింగ్ రాణిస్తున్న సిక్కోలు యువకుడు
- సినిమాల్లో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా రాణింపు

ప్రభాస్ నటించిన కల్కి సినిమా కోసం మినీయేచర్ రూపొందిస్తూ..

సండే స్పెషల్

శ్రీకాకుళం కల్చరల్: చిన్న కాగితంపై వేసిన పెన్సిల్ బొమ్మ అయినా.. వంద అడుగుల ఎత్తున ఉన్న థియేటర్ కటౌట్ అయినా.. ఆ యువకుడు ఆర్ట్ వేశాడంటే అదిరిపోవాల్సిందే. జీవం ఉట్టిపడాల్సిందే. అతనే శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి చెందిన డాకోజు లాల్ ప్రసాద్. తనదైన ప్రత్యేక శైలితో చిత్రకళారంగంలో రాణిస్తున్నాడు. ఆర్ట్, డిజైనింగ్‌లో వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతూ చిత్ర పరిశ్రమలోనూ తనదైన ముద్రవేసే పనిలో నిమగ్నమయ్యాడు.

వారసత్వంగా..

నగరంలోని కంపోస్టు కాలనీలో నివాసముంటున్న లాల్ ప్రసాద్ ఓ ప్రైవేటు కంపెనీలో ఆర్టిస్టుగా పనిచేస్తున్నాడు. తండ్రి గోపాలరావు అరుణ్ ఆర్ట్స్, పెదనాన్న శరత్ 'శరత్ ఆర్ట్స్' ఎంతో ప్రత్యేకత చాటుకున్నాడు. తండ్రి, పెదనాన్నల స్ఫూర్తితో ప్రసాద్ చిన్నప్పటి నుంచే బొమ్మలు వేయడంలో పట్టుసాధించాడు. తొలిసారిగా దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రం గీసి తండ్రితో శెభాష్ అనిపించుకున్నాడు. చిత్రకళలో మెలకువలు నేర్చుకుంటూ వినూత్నంగా బొమ్మలు వేయడంలో పట్టు సాధించాడు. సంప్రదాయ చిత్రకళకే పరిమితం కాకుండా సినీ పరిశ్రమలో కళా దర్శకత్వంలో రాణించాలనే తపనతో ప్రయత్నాలు మొదలుపెట్టాడు. గతంలో విడుదలైన 'మగధీర' చిత్రంలో ఓ సన్నివేశం సెట్ తయారు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. జీవనోపాధిలో భాగంగా వివాహాలు, పుట్టిన రోజులు వంటి కార్యక్రమాలకు డెకరేషన్లు చేస్తూ నిలదొక్కుకుంటున్నాడు.

ప్రశంసల వెల్లువ..

ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న లాల్ యూనిక్ ఆర్ట్స్ పేరుతో చిత్రాలు వేస్తున్నాడు. ప్రముఖ సినీనటులు సోనూసూద్ చిత్రాన్ని అతనికే ప్రెజెంట్ చేసి అభిమానాన్ని పొందాడు. ఇటీవల సోనూసూద్ జన్మదినం సందర్భంగా సైకత శిల్పాన్ని రూపొందించాడు. సినిమాల్లో కళా దర్శకుడిగా రాణించాలనే కోరికలో భాగంగా రామకృష్ణ సబ్బాని వద్ద అసిస్టెంట్‌గా చేరాడు. సెట్ డిజైనింగ్, పెయింటింగ్‌లు చేస్తున్నాడు. పుష్ప సినిమాతో పాటు ప్రభాస్ నటించిన కల్కి సినిమాలో మినియేచర్‌ను ఆకర్షణీయంగా రూపొందించాడు.



థియేటర్ వద్ద తాను వేసిన సలార్ సినిమా కటౌట్ వద్ద లాల్ ప్రసాద్



కళాదర్శకుడు తోట తరణితో..



సోనూసూద్‌కు ఆర్ట్‌ను ప్రెజెంట్ చేస్తున్న లాల్‌ప్రసాద్

కళాదర్శకుడు కావడమే లక్ష్యం

కళా దర్శకుడిగా రాణించడమే లక్ష్యంగా సినిమా పరిశ్రమలో రామకృష్ణ వద్ద అసిస్టెంట్‌గా చేరాను. మంచి అవకాశాలు వస్తున్నాయి. చిత్రాలు గీయడంతో పాటుగా కళాదృశ్యాలు, డెకరేషన్స్ చేస్తున్నాను. విభిన్న కళాకృతులకు ఆదరణ పెరుగుతోంది.

– డి.లాల్‌ప్రసాద్, కళాకారుడు



స్ఫూర్తి ప్రదాత గురజాడ అప్పారావు



మాట్లాడుతున్న అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్: దేశంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతవిద్వేషాలు రగిలించి సామరస్యాన్ని, శాంతిని భంగపరిస్తూ మతోన్మాద శక్తులు చెలరేగుతున్న నేటి పరిస్థితులలో మహాకవి గురజాడ బోధనలను ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జరిగిన సభకు కేతవరపు శ్రీనివాసు అధ్యక్షత వహించగా, గురజాడ చిత్రపటానికి అట్టాడ అప్పలనాయుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వి.జి.కె.మూర్తిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కవి కంచరాన భుజంగరావు, ఎన్‌సీసీ కమాండెంట్ వై.పోలినాయుడుబాడాన శ్యామలరావు, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్, నెట్టిమి రమణ, పూజారి దివాకర్, డి.రామకృష్ణ, ఎం.ప్రభాకరరావు, పి.సుధాకరావు, కె.నాగమణి, సంతోష్, జనార్దన్, చింతాడ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ గురజాడ రచనలు, సమాజంపై చూపిన ప్రభావం వివరించారు. ఎంపీడీవో ఈశ్వరరావు, ఎంఈవో త్రినాథరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



సదస్సులో మాట్లాడుతున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఇన్‌క్లూసివ్ సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సైబర్ సెక్యూరిటీ, సైబర్‌లాస్, మెంటల్ హెల్త్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీఐ మాట్లాడుతు నేటి సాంకేతిక యుగంలో సైబర్ క్రైమ్ విస్తరిస్తున్న తీరును ఉదాహరణలతో సహా వివరించారు. మెడికల్‌అండ్ హెల్త్ విభాగం డాక్టర్ సుజాత, ఐతం కళాశాల కంప్యూటర్స్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ వై.రమేష్ మాట్లాడుతూ చిన్నచిన్న తప్పిదాలు, ఓటీపీలను చెప్పడం ద్వారా సంపద పోగొట్టుకున్న ఉందంతాలు వివరించారు. కార్యక్రమంలో సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రవిశంకర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ సత్యనారాయణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులకు ఎస్పీ సత్కారం



యాజమాన్యం, వైద్యులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల ప్రమాదానికి గురై మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందిన మహిళా హోంగార్డు రేవతిని కోలుకునేలా చేసిన యాజమాన్యం, వైద్యులను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సత్కరించారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, హోంగార్డుకు చికిత్స అందించడంలో ఎక్కువ మొత్తంలో నగదు ఖర్చుని యాజమాన్యం, వైద్యులు భరించడం అభినందనీయమన్నారు. ఎస్పీ సత్కరించిన వారిలో వైద్యులు దానేటి శ్రీధర్, మురళీధర్‌రావు, శివసుందర్, సాగరిక, శ్రీకాంత్‌లున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీలు వివేకానంద, అప్పారావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ



కాలిపోయిన కుటీర పరిశ్రమ

జి.సిగడాం:

మండలంలోని సేతుభీమవరంలో మట్టి కుండలు తయారు చేసే కుటీర పరిశ్రమలో ఈ నెల 28న అగ్ని ప్రమాదం జరగడంతో రూ.3 లక్షల విలువైన సామాగ్రి కాలిపోయాయి. ఇక్కడి పరిశ్రమలో నాగవరపు గురుమూర్తి, సింహాచలం, అప్పారావు, ఆదినారాయణ, పైడియ్య, సాయి, సత్యం, వీరాస్వామి, రాము, అప్పలరాజులు తాము తయారు చేసిన కుండలు ఇందులో నిల్వ చేసి విక్రయించి జీవనోపాధి పొందేవారు. మొత్తం కాలిపోవడంతో బాధితులు తీవ్రంగా నష్టపోయారు. బాధితులను సర్పంచ్ తొత్తడి రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు కుదిరెళ్ల సుజాత, ఉపసర్పంచ్ నాగవరపు సాయి శనివారం పరామర్శించారు.

వ్యక్తి దాడిపై కేసునమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామానికి చెందిన గురుగుబెల్లి రమణారావు అనే వ్యక్తి శుక్రవారం బైక్‌పై వెళ్తుండగా కమ్మపేట సమీపంలో బెండి అప్పలనాయుడు అనే వ్యక్తి అడ్డుకుని దాడికి పాల్పడ్డాడు. వీరిద్దరికీ గతంలో వ్యక్తిగత కక్షలు ఉన్నాయి. గాయపడిన రమణరావును శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఔట్ పోస్టు సమాచారం, మెడికల్ రిపోర్టు మేరకు ఎచ్చెర్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

ఆకాశవాణిలో లలితారెడ్డి ఇంటర్వ్యూ

జి.సిగడాం: గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా ముత్యాల సరాలులో సంస్కరణ వాదం అనే అంశంపై జి.సిగడాం కస్తూర్బా గాంధీ విద్యాలయం తెలుగు ఉపాధ్యాయురాలు, రచయిత్రి లలిత రెడ్డి ఇంటర్వ్యూ శనివారం ఆకాశవాణి(ప్రసారభారతి) ఆదిలాబాద్ కేంద్రం నుంచి ప్రసారమైంది. ఈ సందర్భంగా లలితారెడ్డిని ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల, తెరవే అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి అభినందించారు.

బీఆర్ఏయూ ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు ప్రశంసలు



సాహస శిబిరంలో బీఆర్ఏయూ బృందం

ఎచ్చెర్ల క్యాంపస్: హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో 10 రోజులుగా నిర్వహించిన జాతీయ సేవా పథకం సాహస శిబిరం శనివారంతో ముగిసింది. వర్సిటీ నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరి ప్రదర్శనకు ఉత్తమ చురుకైన బృందంగా ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు. వీరిని వర్సిటీ అధికారులు అభినందించారు.

వైభవంగా కోటి వత్తుల ఆరాధన



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో లలితా సహిత శివకామేశ్వరునికి శనివారం మాస శివరాత్రి సందర్భంగా కోటి వత్తుల ఏక దీపంతో ఆరాధన చేశారు. శివకామేశ్వరుడు, నందీశ్వరులకు 21 సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని రుద్రాక్షలతో అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : ఏ పనీ చేయకుండా మొబైల్ చూస్తునే ఉంటావని భర్త మందలించడంతో జిల్లాకేంద్రంలోని ఓ వివాహిత(23) తన రెండేళ్ల బాబుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ నెల 26న ఈ ఘటన జరగ్గా.. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో భర్త రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

ప్రతిభకు గుర్తింపు



జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో గంజాయి పట్టివేత, ప్రాపర్టీ నేరాల ఛేదన, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్స్, గుడ్ వర్క్స్, ముద్దాయిలకు శిక్షపడటంలో చాకచక్యంగా వ్యవహరించిన వారికి ఎస్పీ ప్రశంసాపత్రాలను శనివారం అందజేశారు. నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో గృహహింస కేసులో నిందితుడికి శిక్ష పడేలా వాదించిన నరసన్నపేట మెజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంతి సంతోషికి ఎస్పీ ప్రశంసించి గౌరవించారు. సీఐలు ఎం.అవతారం (జె.ఆర్.పురం), పైడపునాయుడు (శ్రీకాకుళం రూరల్), శ్రీనివాసరావు (నరసన్నపేట), డి.మోహనరావు (కాశీబుగ్గ), రామారావు, ఈశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బంది ప్రశంసాపత్రాలు అందుకున్నారు. – శ్రీకాకుళం క్రైమ్

ప్రకృతి సేద్యం లాభదాయకం



ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల ఐదు రోజులు శిక్షణ శనివారంతో ముగిసింది. జిల్లా వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 250 మంది కార్యకర్తలకు ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు, వ్యవసాయ గులికలు, సేంద్రీయ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి, అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయరావు పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

గంజాయి అరికడదాం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలని, అపరిష్కృతంగా ఉన్న మహిళలు, చిన్నారుల వేధింపుల కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలని పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ అధికారులతో నెలవారీ నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని,మార్కెట్లు, బ్యాంకులు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలను కట్టడి చేయాలన్నారు.

3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఈ నెల 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సహాయ సంచాలకులు కె.కవిత శనివారం తెలిపారు. కార్యక్రమంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

అనాథలకు అండగా..



బెహరా మనోవికాసకేంద్రంలోని దుప్పట్లు అందజేస్తున్న బ్యాంక్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని బెహరామనోవికాస కేంద్రం, ప్రశాంతి వృద్ధజనాశ్రమాల్లో శనివారం దుప్పట్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఎంపవర్ హెర్ అండ్ ఎంపవర్ హిమ్ వారి సేవా కార్యక్రమంలో భాగంగా 200 దుప్పట్లు, సరుకులు అందజేసినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ తిలక్, కమిటీ సభ్యులు పి.రవి, ప్రసాద్, రేష్మ, వైకుంఠరావు, ఇందిరా, సంతోషి, యూనియన్ సభ్యులు తేజశ్వరరావు, అవార్డు సంఘ నాయకులు బి.శ్రీనివాసులు, బ్యాంక్ సిబ్బంది గాయత్రీ, చైతన్య తదితరులు పాల్గొరు.

సమస్యల పరిష్కారానికి కృషి



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార: ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శనివారం మండలంలోని మొగదాలపాడు, వత్సవలస, పేర్లవానిపేట గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో శనివారం 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సీపాన హరిహరరావు తెలిపారు. వలసల సమస్య కారణంగా డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలేం వంటి గ్రామాల్లో పూర్తిస్థాయిలో పింఛన్లు పూర్తికాలేదని చెప్పారు.

అలరించిన బాలు సినీ గాన లహరి



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో శనివారం నిర్వహించిన ఎస్పీ బాలు సినీ గాన లహరి అలరించింది. కల్యాణం రామ్మోహన్‌రావు, బండారు రమణమూర్తి నిర్వహణలో రామ్మోహన్, అమిత, రాజమోహన్, నిక్కు అప్పన్న, రమణరావు, కెఎల్ఎన్ మూర్తి మండా శ్రీనివాస్‌లు చక్కటి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలోడాక్టర్ కె.అమ్మన్నాయుడు, నిక్కు హరిసత్యనారాయణ, మండా కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత కుటుంబానికి సాయం



కుటుంబానికి చెక్ అందిస్తున్న సమితి సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీ జీరోలైన్‌లో నివాసముంటున్న జమాన్ లక్ష్మణ్ క్యాన్సర్‌తో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి పంచగిరి సేవా సమితి సభ్యులు శనివారం రూ.50వేలు సాయం అందించారు. పి.కె.ఎంటర్‌టైన్‌మెంట్ చానెల్ ద్వారా చెక్కును అందజేశామని ట్రస్ట్ అధ్యక్షుడు సింహాద్రి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో నారాయణశెట్టి కిరణ్‌కుమార్ లాలా, గుడ్ల రామారావు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది కొత్తగా తీసుకొచ్చిన ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ కోర్సుతోపాటు ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 2న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ శనివారం తెలిపారు. ఏపీ పీజీసెట్-2024 దరఖాస్తు, అర్హతలతో సంబంధం లేకుండా డిగ్రీలో బీఎస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. మెడికల్ బయో టెక్నాలజీలో 19 సీట్లు, కెమిస్ట్రీలో 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రవేశ రుసుం రెండు మూడు విడతల్లో చెల్లించేందుకు అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మాత్రం వర్తించదని స్పష్టంచేశారు. పూర్తి వివరాలకు 8555911961, 6301096643, 9441387184 నంబర్లను సంప్రదించాలని కోరారు.